# నా సంపాదకీయాలు



డా॥ వెలిచాల కొండలరావు

# నా సంపాదకీయాలు

('జయంతి' విశ్వనాథ సాహిత్యపీఠం త్రైమాసిక పత్రిక,
'తెలుగు' తెలుగు అకాడమి మాస పత్రికల్లోని కొన్ని సంపాదకీయాలు)

డా. వెలిచాల కొండలరావు

# Jayanti Editorials

*By*

**Dr. KONDAL RAO VELCHALA**

First Edition 2013

*Published by*
**Vishwanatha Shitya Peetam's**
**SISTER NIVEDITA FOUNDATION PUBLICATIONS**
11-4-654/3, Near Niloufer Hospital, Red Hills, Hyderabad - 500 004.
Phone: 23396358; 9848195959, e-mail : vkrao@sncps.com

@ **Dr. V. Kondal Rao**

Rs. 125/-

*Copies can be had from*
All Leading Booksellers in India and from the Foundation

# సంచికా సంపాదకీయులకు మంచి నమూనాలు

**- ఆచార్యగుమ్మన్నగారి బాల శ్రీనివాసమూర్తి**

ఇటీవలే రావూరి భరద్వాజ గారి ప్రత్యేక సంచక రూపుదిద్దుకుంటున్న క్రమంలో జయంతి పత్రిక నుండి నాకు ఫోన్ వచ్చింది. భరద్వాజగారి దేదైనా రచనను విశ్లేషిస్తూ వీలైనంత తొందరలో వ్యాసం పంపవలసిందిగా ఫోన్ లో కోరారు. నేను భరద్వాజ గారి 'ఇనుప తెరల వెనుక' గురించి విశ్లేషణను రాసి దాన్ని జయంతి కార్యాలయంలో ఇచ్చేందుకు వెళ్ళాను. వేసవి కాలపు మిట్ట మధ్యాహ్నం, ఎండ మండిపోతోంది. అంతటి ప్రతికూల వాతావరణంలోనూ ఎనమిది పదులు పూర్తి అయిన డాక్టర్ వెల్చాల కొండలరావుగారు పనిచేస్తూ కూర్చున్నారు. వారితో ఎప్పుడైనా సరే కనీసం అరగంటకు తక్కువ కాకుండా మాట్లాడడం అలవాటుగా పెట్టుకున్నాను. వారితో సంభాషించే క్రమంలో ఎన్నో వినూత్న విశేషాలు, అపారమైన అనుభవాలు తెలుస్తాయన్న ఆశ అందుకు కారం. కొండలరావుగారికి నా పట్ల వాత్సల్యం ఉండడం నా అదృష్టం. ఈ నేపథ్య యావత్తూ ఎందుకు చెబుతున్నానంటే, కొండలరావుగారు నాకు భరద్వాజ సంచికలో తాము రచించిన సంపాదకీయాన్ని వినిపించారు. నేను ఎంతో ఆనందించాను, ఆశ్చర్యపోయాను. ఒక సీనియర్ సాహితీవేత్త యావత్ అక్షర జీవనాన్ని, దాని స్వరూప స్వభావాల్ని తార్కిక రీతిలో ఆ సంపాదకీయంలో సింహావలోకనం చేసిన తీరు - నిజం చెప్పాలంటే నన్ను కొంత విస్మయానికి గురిచేసింది. అది వరకు కూడా జయంతి సంపాదకీయాలు చదివే ఉన్నాను. భరద్వాజగారిపై రచించిన సంపాదకీయం చదివిన తర్వాత వాటిని మరోమారు విశ్లేషణాత్మక దృష్టితో చదివాను. సాహిత్య పత్రికల సంపాదకీయ రచనకు వెలిచాల వారి సంపాదకీయాలు అత్యుత్తమ ఆదర్శాలు అని చెబితే అది అతిశయోక్తి కాదు. సాహత్య సంపాదకీయాలకు చక్కని నమూనాలవి.

పత్రికలకు సంపాదకీయాలు ఎంతో అవసరం. పత్రిక అభిప్రాయాన్ని విస్పష్టంగా వెల్లడించేందుకు సంపాదకీయాన్ని మించిన సాధనం లేదు. ఇది వ్యాఖ్యాకేంద్రం. అయితే సంపాదకీయాల ప్రాముఖ్యతలు ప్రాధాన్యతలలో పత్రికకు - పత్రికకూ మధ్య తారతమ్యాలు ఉంటాయి. దిన పత్రికల్లో సంపాదకీయాలకు చాలా ప్రత్యేకస్థానం ఉంటుందనే సత్యం తెలిసిందే. దిన పత్రికా సంపాదకీయాలు సమాజ ఆలోచనల్ని మార్చగలిగిన సందర్భాలున్నాయి. గతంలో తెలుగువారు రాజకీయ దిశా దర్శనం కోసం నార్ల వెంకటేశ్వరరావు, గోరాశాస్త్రి వంటి సంపాదకుల సంపాదకీయాలపై ఆధారపడే వారని చెబుతారు. దిన పత్రికల సంపాదకీయాలకు "సమకాలీన విలువ" మాత్రమే ఉంటుంది. నిన్నటి సంపాదకీయం నేటికి తన ప్రాసంగికత (రిలవెన్స్)ను కోల్పోవడం సహజమే. దిన పత్రికా సంపాదకీయాల్లో వ్యంగ్యం, నిశితవ్యాఖ్యా గుంఫనం, కొంతవరకు దూకుడుతో కూడిన వాక్య విన్యాసం అవసరమేనని చెబుతారు. వార పత్రికల్లో

సంపాదకీయాల ప్రాధాన్యత నామమాత్రమే. ఈ తీరు ఆంగ్ల మేగజైన్ జర్నలిజం లోనూ కనబడుతుంది. అయితే మాస పత్రికల సంపాదకీయాలకు మాత్రం సమకాలీనత కంటే శాశ్వతత్వం ఎక్కువ. ప్రధానంగా, సాహిత్య మాస పత్రికల సంపాదకీయాలలో సునిశితమైన సూత్రకరణ దృష్టి, సుస్థిరమైన దృక్పథాన్ని పెంపొందించగలిగే నేర్పు ఉండాలి. సంయమన వైఖరి అనివార్యమైన అవద్యకత. ఈ మంచి లక్షణాలన్నీ కొండలరావుగారి జయంతి సంపాదకీయాలో ఉన్నాయి. అభిప్రాయాన్ని ఎటువంటి అస్పష్టతలు లేకుండా ప్రకటించడం సంపాదకీయానికి కొత్త వన్నెలు తెచ్చిపెతుంది. ముచ్చటగా మూడవసారి జయంతిని ఆరంభించిన సందర్భంలోని సంపాదకీయం స్పష్టతకు ప్రతిరూపం. సాహిత్య పత్రికల మనుగడ ఎంత కష్టసాధ్యమైనదో సంపాదకీయం వ్యాఖ్యానించింది. అదే విధంగా తమ పత్రిక దేశీయమైన విలువలకు ప్రాధాన్యత నిస్తుందని అరమరికలు లేకుండా సంపాదకీయంలో ప్రకటించారు. సాహిత్య వాచకం (టెక్ట్స్)లో కళాత్మకమైన విలువలు తప్పకుండా ఉండాలని ...... సంపాదకీయం తేల్చి చెప్పింది. సంపాదకీయంలోని ఒక పేరాగ్రాఫు కొండలరావుగారి అభిప్రాయాల్లోని స్పష్టతను, నిర్మొహమాట వైఖరిని చెబుతోంది. ఆ పేరాగ్రాఫు ఇది :

"గ్రాంధిక వ్యావహారిక భాషావాదాలు సాహిత్యంలో అనవసరమైన అవగాహనా లోపభూయిష్టమైన కల్లోలం సృష్టించినాయి. అవి కలిగించిన లాభం ఎంతనేది అట్లా ఉంచి అది కలిగించిన నష్టం మాత్రం గొప్పది. ప్రాచీనమైన సాహిత్యానికి సంబంధించి విపరీతమైన నైరస్యం, వైముఖ్యం పెంపొందించాయి. ఇప్పటికీ ఆ గోతిలోంచి మనం బయట పడలేకపోతున్నాం. ఆ వాదాలకు పేర్లే సరిగా కుదరలేదని మలి జయంతి నాటి నుంచీ మేము చెబుతూనే ఉన్నాము. ఇప్పటికి గాని భాషా విశేషజ్ఞులు అందులోని యాదార్థ్యాన్ని గుర్తించలేదు. భాష, భాషాప్రౌఢిమ, భాషా సారళ్యం, పలుకుబడి, నుడికారం వంటి అనేకానేక అంశాలు అందులో ఇమిడి ఉన్నాయి. వాటి నన్నింటినీ పరిగణలోకి తీసుకోవలసి ఉంటుంది...

ఎటువంటి "పూర్వ నిర్ధారణలు" లేకుండా ఆలోచించినట్టయితే పై పేరాగ్రాఫ్‌లోని కొండలరావుగారి అభిప్రాయం పూర్తిగా సత్యమనే ముక్తాయింపు కలుగుతుంది!

గత శతాబ్ది మూడవ దశకంలో సంచలన కవి పఠాభి. "ఫిడేలు రాగాల డజన్" లో సంప్రదాయ తెలుగు కవితారీతిపై దండెత్తిన ప్రయోగవాది. శ్రీశ్రీ వంటి ఆధునికుల అభిమానాన్ని దానితో సమానంగా దువ్వూరి రామిరెడ్డి వంటి కాల్పనిక కవుల విమర్శల్ని ఎదుర్కొన్న కవి పఠాభి. ఆధునిక తెలుగు కవిత్వాన్ని సమీక్షించే ప్రతి సందర్భంలోనూ పఠాభిని స్మరించడం సంప్రదాయంగా వస్తోంది. అయితే చాల మందికి పఠాభి కవిగానే తెలుసు. కొంతమందికి సినిమా దర్శకుడిగా తెలుసు. చాలా తక్కువ మందికి ఆయన ఒక సామ్యవాద సిద్ధాంత ఆచరణశీలి అన్నది తెలుసు. తాను అనుకున్న ఆదర్శాల్ని అక్షరాలా ఆచరించి చూపిన గొప్ప వ్యక్తిగా చాలా తక్కువమందికి తెలుసు. పఠాభి అర్థాంగి స్నేహలత కూడా సామ్యవాద సిద్ధాంత ఆచారణలో భర్తతోపాటు నడిచారు. అత్యవసర పరిస్థితి కాలంలో చనిపోయారామె. పఠాభి

స్నేహలతల జీవిత వ్యక్తిత్వాల్ని గురించి 2006లో (జులై–డిసెంబర్) కొండలరావుగారు రచించిన సంపాదకీయం ఎంతో గొప్పది. ఈ సంపాదకీయంలో కొండలరావుగారి 'నిమగ్నత' (ఇన్‌వాల్వ్‌మెంట్) సుస్పష్టంగా కనబడుతుంది. ఈ నిమగ్నతకు ఒక ప్రధాన కారణం ఉందనిపిస్తుంది. పఠాభి–స్నేహలతలు సోషలిస్టులు. డాక్టర్ రామ్ మనోహర్ లోహియాకు పఠాభి బాగా సన్నిహితులు, కొండలరావుగారు కూడా లోహియాను బాగా అభిమానిస్తారు. ఇట్లా పఠాభి వ్యక్తిత్వాన్ని, స్నేహలత గొప్పతనాన్ని విభిన్న కోణంలో కొండలరావుగారు విశ్లేషించిన తీరు వినూత్నమైంది. పఠాభిని గురించి ఇటువంటి వ్యాసం తెలుగులో వెలువడలేదు. ఈ సంపాదకీయ రచనకు గాను కొండలరావుగారు పఠాభిని విస్తారంగా అధ్యయనం చేసినట్టు సులువుగానే తేటతెల్లమవుతుంది. పఠాభి–స్నేహలతల్ని గురించి స్మృతి వాక్యాలు కేవలం ప్రశంసల కోసం రాసినట్టుగా కన్పించవు. ఒక సహృదయుడి అప్రయత్న అభివ్యక్తీకరణకు దాఖలాలుగా ఉన్నాయి. వాటిని ఇక్కడనే ఒకసారి పరిశీలించండి:

"పఠాభి అర్థంకన్నా అందాన్ని ఆశించిన ఆరాధించిన సాహసి
పఠాభి ధనాని కన్నా ఘనాన్ని ఎన్నుకున్న సాహసి
పఠాభి సంపదను పెంచుకోవడం కన్నా సంపద పంచుకోవడానికి ప్రాధాన్యతనిచ్చిన సాహసి"

"స్నేహానికి – సంస్కారానికి మరోపేరు స్నేహలత" అంటూ

"నియంతృత్వానికి వ్యతిరేకంగా గొంతెత్తి చెరసాలపాలై తుదకు ప్రాణాలు కోల్పోయిన అసలు సిసలైన ప్రగతి శీలవాది, అభ్యుదయవాది, పారదర్శకవాది; చెరసాలలో కూడా తన గురించి కాక తనతోటి వారి గురించే ఆలోచిస్తూ వారి బాగోగుల కొరకు చేదోడు వాదోడుగా నిలుస్తూ తన కొరకు కాక వారికొరకు నిర్వాహకులను నిలదీసిన నిస్వార్థి... గుండె వరదలై పారుతున్నా కాయం గాయమై పొడుస్తున్నా దిగులుగా కన్పించక తన గుండె నొప్పులను తన గుండె లోతుల్లోనే దాచుకొని గుబాళించిన నిబ్బరి, నిర్భయి..." అని నివాళి పలికారు కొండలరావుగారు.

పఠాభి స్నేహలతలపై రచించిన సంపాదకీయం నన్ను కదిలించింది. వీలైతే మరోమారు చదవవలసిందిగా సహృదయులకు నా మనవి.

ప్రముఖ కవి ఇస్మాయిల్‌ను గురించి రచించిన స్మృతి సంపాదకీయం కూడా విలువైనదే. ఇక్కడ కొండలరావుగారు ఇస్మాయిల్ కవితల్లోని పదాల పొదుపును పాటించారు. ఇస్మాయిల్ కవిత్వంపై వ్యాఖ్యానిస్తూ "ఇస్మాయిల్ కవితలు నాదాలు కావు – అంతర్నాదాలు" అన్నమాట ఎంత గొప్పది. బహుశా, ఇస్మాయిల్ కవిత్వాన్ని అభిమానంతో చదివిన వారంతా ఈ వ్యాఖ్యతో ఏకీభవిస్తారు. ప్రసిద్ధ కవి, ఉద్యమశీలి పాబ్లోనెరుడాను గురించి కవితాత్మక సంపాదకీయం ఎంతో గొప్పగా ఉంది. "ఉద్విగ్న సుందర వచన కవిత" ప్లాబ్లో నెరుడాను గురించి చెబుతూ "అర్థాలకు సరికొత్త అర్థాలు కనుగొన్న కవి" గా కొండలరావుగారు అభివర్ణించారు.

పి.వి. నరసింహారావుగారిని గురించి సంపాదకీయం ఒక 'ప్రామాణికమైన ప్రొఫైల్' రచనగా పేర్కొనదగింది. ఇందులో సంపాదకీయం రచయితకు పి.వి.లో గల వైయక్తికమైన సామీప్యతను సులువుగానే గుర్తించవచ్చు. ఆ సాన్నిహిత్యం లేకపోతే ఇటువంటి సహజరీతి సంపాదకీయం రచన సాధ్యం కానేకాదు. పి.వి. బహుముఖ ప్రజ్ఞలోని అనేక పార్శ్వాల్ని సంపాదకీయం తాత్వికంగా ఆవిష్కరించింది. అట్లాగే గుంటూరు శేషేంద్ర శర్మను గురించిన సంపాదకీయం కూడా, నిసర్గ కవితా ప్రతిభగా నిర్వహింపవలసిన శేషేంద్ర వ్యక్తిత్వాన్ని సానుకూల దృష్టితో అంచనా వేసేందుకు ఈ సంపాదకీయం తప్పకుండా తోడ్పడుతుంది. ఇదివరకు ఎవరికైనా ఆయనపట్ల ఉన్న గౌరవాన్ని ఈ సంపాదకీయం ఇనుమడింప చేస్తుంది. ఋషి తుల్యులైన జువ్వాడి గౌతమరావుగారు కొండలరావుగారికి బాగా సన్నిహితులు. విశ్వనాథ హృదయంగా గుర్తింపును పొందిన వారు గౌతమరావుగారు. ప్రచార పరాన్ముఖులు. ఆయన జీవితంలోని పలు పార్శ్వాల్ని ఉదాత్త వ్యక్తిత్వ మాధుర్యాల్ని కొండలరావుగారి సంపాదకీయం పరిచయం చేసింది. స్వర్గీయ సామల సదాశివ గారిని గురించి రచన కూడా ఇటువంటిదే.

సాహిత్యంలో పునాది స్థాయిలో ఉండవలసిన అంశాలు ఏమిటి? సాహిత్య ప్రక్రియల్లో వాడవలసిన భాష ఎటువంటిది? అనే అంశాలలో కొండలరావుగారి అభిప్రాయాలు జయంతి సంపాదకీయాలలో ప్రతిధ్వనిస్తాయి. తెలుగు సృజనకారులు, విమర్శకులు కూడా "అభివ్యక్తి" అనే అణుబాంబు వంటి ముఖ్యశక్తి పట్ల ఉదాసీనంగానే ఉన్నట్లు కనబడతారు. నిజానికి "అభివ్యక్తి" ఏ రచనకైనా ప్రాణ సమానమైనది. కొండలరావుగారు సరియైన అభివ్యక్తి అవసరమనే విషయంలో నిక్కచ్చిగా ఉంటారు. జయంతి సంపాదకీయాలలోని కొన్ని భాగాలు ఈ కీలకమైన అంశాల్ని చెబుతున్నాయి. స్థూల దృష్టికి సోకని "అభివ్యక్తి" వంటి ఎన్నో అంశాల్ని జయంతి సంపాదకీయాలలో కొండలరావుగారు ప్రస్తావించారు. ఈ సూచనాత్మక రచనల్ని చదువుచున్నపుడు ఆచార్య మార్గనిర్దేశకమైన అనుభవం ఏర్పడుతుంది.

కొండలరావుగారు విద్యావేత్త, తెలంగాణ యావత్ ప్రజానీకం గొప్పగా ప్రశంసించ వలసిన మేధావి. చక్కని దార్శనికులు. సమకాలీనతను వ్యతిరేకించని ఉదారవాది. విద్యారంగంలో ప్రస్తుతం కనబడుతున్న ఆధునిక విలువల పట్ల ఆయనకు తర్క రహితమైన వ్యతిరేకత ఏదీలేదు. అయితే ఆధునికత పేరుతో పొడసూపుతున్న అనమానవీయత, యాంత్రికతలపట్ల ఆయనకు వ్యతిరేకత. జయంతి సంపాదకీయాలలో కొన్ని విద్యారంగ విశ్లేషణకు సంబంధించినవి. ఇవి వర్తమాన కాలంలో విద్యారంగంలో ఉన్న యువ మేధావులకు, విద్యా సంస్థల నిర్వాహకులకు దారి దీపాలుగా ఉంటాయి. విద్యారంగం మీద ఏది రాయాలన్న ఆ రంగానికి సంబంధించిన అనుభవం, విస్తారమైన వాఙ్మయ అధ్యయనం అవసరం. ఈ నేపథ్యం కొండలరావుగారికి సంపూర్ణంగా ఉంది. ఈ సత్యం సంపాదకీయాలలో స్పష్టమవుతుంది.

ఒకప్పుడు లిఖితశైలి – మౌఖికశైలి వేరువేరుగా ఉండేవి. రానురాను లిఖిత–మౌఖిక శైలులు తెలుగు రచనా రంగలో వేరువేరు స్రవంతులుగా ప్రవహించాయి. అటు తర్వాత

అంటే ఇటీవలి కాలంలో అచ్చుమైన లిఖితశైలి అంతరించిపోతోంది. మౌఖికశైలే లిఖిత శైలిగా చెలామణి అవుతోంది. ఈ సత్యాన్ని కొద్దిమంది మాత్రమే గుర్తిస్తున్నారు. లిఖిత సంప్రదాయానికి అనుగుణంగా రచనలు చేస్తున్నారు.

అటువంటి వారిలో కొండలరావుగారు ఒకరు. జయంతి సంపాదకీయాలలో ఎక్కడా మౌఖిక శైలి చొరబాటు కన్పించదు. ఒకసారి సంపాదకీయాన్ని రచించిన తరువాత దాన్ని తిరిగి, తిరిగి చక్కగా తీర్చిదిద్దుకునే తీరుకూడా సంపాదకీయాల్లో కనబడుతుంది. కొండలరావుగారి బాధ్యతాయుత దృక్పథం సాహిత్య ప్రామాణికత పట్ల ఆయన ఏర్పర్చుకున్న నిబద్ధతలు ఇక్కడ విస్పష్టమవుతాయి. సంపాదకీయ వాక్యాలలో అక్కడక్కడా గ్రాంధిక ఛాయలన్నవి ఉన్నాయి. అయితే అవి ఎక్కడా పాఠకుడికి ఇబ్బందులు కలిగించవు. మిగతా వాక్యాల్లో పూలలో దారం వలె కలిసిపోతాయి. పలు సందర్భాలలో చేసే యడాగమ ప్రయోగాలు గతంలో కొండలరావుగారి సాహిత్య అధ్యయన ప్రభావం వల్ల వెలువడినవేనని పిస్తుంది. కొన్నిసార్లు ప్రామాణిక సూత్రీకరణలుగా ఉండే వాక్యాలూ కనబడతాయి. అందుకు అవసరమైన తర్కమూ సంపాదకీయాలలో దొరుకుతుంది. కొన్ని కొన్ని సందర్భాలలో తెలంగాణాలో ఆనాడు బాగా ప్రచారంలో ఉండి నేను చాలామంది మరచిన 'తిరల మరల' వంటి మాటలు సంపాదకీయాల్లో ఉన్నాయి. స్థానీయ పలుకుబడిని ప్రేమించేవారికి ఇవి పుట్టెడు ఆనందాన్ని అందిస్తాయి.

తెలుగులో కొక్కొండ వెంకటరత్నం పంతులు సంపాదకీయ రచనకు అంకురార్పణ చేస్తే నార్ల, గోరాశాస్త్రి, ప్రతాపరెడ్డి, నండూరి రామమోహనరావు వంటి వారు కొత్త దారులు వేశారు. దిన పత్రిక సంపాదకీయ రచయితలు వీరు వేసిన దారివెంట కొంత దూరమైనా నడవవలసిందే. ఈ మేరకు దిన పత్రికా సంపాదకీయాలకు మార్గదర్శకులున్నారు, వారు రాసిన మార్గదర్శినుల వంటి సంపాదకీయ సంపుటాలూ ఉన్నాయి. మాసపత్రికల విషయంలో ఇంతవరకు అటువంటి మార్గ దర్శినుల స్థాయి సంపాదకీయ సంపుటాలు (ఒకటి రెండు మినహా) వచ్చినట్లు లేదు. కొండలరావుగారి సంపాదకీయ సంపుటి ఈ లోటును తీర్చుతుంది. ఒక మాసపత్రిక సంపాదకీయ రచనలో ఉండవలసిన శాశ్వతత్వ స్పృహ, సంయమనం, హుందాతనంతో కూడిన భాష, సున్నితత్వంతో కూడిన అభివ్యక్తి, స్పష్టత, ప్రామాణికతలు ఎట్లా ఉండాలో కొండలరావుగారి సంపాదకీయాలు చెబుతాయి.

సంచికా సంపాదకీయాలకు మంచి నమూనాలు కొండలరావుగారి సంపాదకీయాలు.

(వ్యాసరచయిత తెలంగాణ విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్)

# విశ్వనాథ సత్యనారాయణ గారి సంపాదకీయము

**(నవంబర్ 1958 'జయంతి' మొదటి సంచిక నుండి)**

ఇది మఱల నింకొక సాహిత్య పత్రికను మే మారంభించుచున్నాము. ఆరంభించవలసిన యవసరమేమి? ఇదివఱకున్నవి చాలవా? యను ప్రశ్న యున్నది. చాలవని మా యభిప్రాయము కనుకనే దీని నారంభించుట.

ఈ నా డాంధ్ర సాహిత్యము బహుమార్గములుగా పోవుచున్నది. ఇది సువ్యవస్థితమైన మార్గమని చెప్పుటకు వీలులేకుండ నున్నది. ప్రాత మార్గము, క్రొత్త మార్గము, ప్రాత లేకుండ నున్నది. ప్రాత మార్గము, క్రొత్త మార్గము, ప్రాత మార్గము పూర్వచ్ఛందోబద్ధమై నడచుచున్నది. క్రొత్తది నడక నాశ్రయించి సాగుచున్నది. ప్రాతమార్గము కవిత్వమునకు సంకెలలు వేయుట వంటిదని క్రొత్తవారి యభిప్రాయము. క్రొత్తవారిది విశృంఖల మార్గమని పూర్వుల యభిప్రాయము. క్రొత్త మార్గములో పూర్వచ్ఛందస్సు యొక్క పరిత్యాగ మొక్కటియే కాదు, వాడుకభాషయొక్క యధేచ్ఛా స్వీకారము కలదు. క్రొత్తమార్గములోని యెక్కువ శోభ రెంటి నాశ్రయించి యధికముగ కనిపించుచున్నది. మొదటిది వృత్త్యనుప్రాసము. రెండవది అంత్యప్రాసము. ఈ యంత్యప్రాసము యమకముతో జోడింపబడియుండును. దీనిని హిందీభాషలో తుక్‌బందీ అందురు. హిందీలో ఆధునిక సారస్వత పితామహు లిద్దరిలో ఒకాయన పేరు మహావీర్ ప్రసాద్ ద్వివేదీ. ఆయన ఈ తుక్‌బందీని యెక్కువగా ప్రశంసించలేదు. దీనిచేత పాఠకుని మనస్సులో ఒక విధమైన చక్కిలిగింత కలుగునని పైగా రసాస్వాదమునకు భంజికమని కూడ ద్వివేదిగారి యభిప్రాయము. అరువు తెచ్చుకొన్న చోటనే దాని వెల తక్కువ గదా!

ఈ క్రొత్త కవిత్వములోని వస్తువు ఆధునికములైన కొన్ని పరిస్థితుల చుట్టు ప్రదక్షిణము చేయుచుండును. ఆకలి పేదవాళ్లు, ధనవంతుని దురాగతములు, మతనిరాసము. ఇవి ప్రధాన విషయములు. వారికొక ప్రత్యేక శబ్దజాలము కలదు. పూర్వ సంప్రదాయపు కవులకు కోకిల వసంతము సెలయేఱు కృతకాద్రులు తామరపూలు వెన్నెల విరహము ఈ మొదలైన సరుకు కలదు. ఆధునికులకు ఫిరంగులు, ఉక్కు తెఱ, ఇనుప బూట్ల కాళ్లు, చీకటి, అస్థిపంజరములు మొదలైన సామగ్రి కలదు. ఉభయత్ర గాఢమైన కవితాభావన లేనివారు ఈ సామగ్రి చుట్టును ప్రదక్షిణము చేయుచుందురు. కొద్దిలో ఆధునికమైన ఉభయ సాహిత్యముల దోష మిది.

కవి తానే ఛందస్సును స్వీకరించినను, ఇట్టి సామగ్రీ బాహుళ్యము చేత, దీని ప్రాధాన్యము చేత, ఆతని రచన నీరసమగును. ఈ సామగ్రి నాశ్రయించిన భావములు సర్వదా షిష్టషేషణములు, చర్విత చర్వణములు. కాని ఈ సామగ్రినే తీసుకొని ఒకానొక మంచి వాణ్మె పుణ్యములు గల కవి చెప్పిన తరహాలోని సొగసుచేత ఒక రమ్యత తేవచ్చును. అది మాట నాశ్రయించిన సౌందర్యము, దానికి లోతుండదు. ఆమె యెఱ్ఱనిది. కనుముక్కు తీరు బాగుగా లేనిది. ఆ కవిత యట్టిది.

మఱియు ఈ రెండు ఛందోమార్గముల గుణాగుణములను విమర్శించినచో అనగా భిన్నచ్ఛందస్సుల యందు అంతర్నిహితమైన శక్తులను విచారించినచో పూర్వఛందస్సునందున్న పుష్టి ఆధునిక ఛందస్సునందు లేదు. ఇది గాలిలో లేచిపోవు దూదివలె నుండును. అది స్థిరమైనదిగా కనిపించును.

వృత్తములు కొన్ని వందలు కలవు. వేలు కలవు. నన్నయ్య గారి సంప్రదాయమును బట్టి చంపకమాల, ఉత్పలమాల, మత్తేభ శార్దూలములు, కందము, సీసము, గీతము, ఇవి ప్రధానముగా ఆంధ్రభాషా కావ్యోపయోగి ఛందములుగా స్వీకరింపబడినవి. ఆ మార్గమున వ్రాయబడిన కావ్యములు వందలయేండ్లు నిలచినవి. ఈ నిలుచుటయే ఆ ఛందస్సుల యొక్క పౌష్కల్యమునకు సాక్ష్యము. ఈ వృత్తములు సంస్కృత భాషాకావ్యములలో లేవు. శార్దూలమొక్కటియే సమానమైనది. సంస్కృత కావ్యములలో నే వృత్తములు కలవో ఆ వృత్తములు ప్రధానముగా నాంధ్రభాషకేల పనికి రాలేదు? ఆ సంస్కృత కావ్యములు వ్రాయబడిన వృత్తములలో వ్రాయబడిన తెలుగు కావ్యములు రెండు మూడు కలవు. వానికి స్థితి లేదు. ఎందుచేతననగా ఒక భాష కొక శక్తి యుండును. ఒక ఛందస్సున కొక శక్తి యుండును. ఈ రెండు శక్తులు కలిసికొన్నచోట ఈ ఛందస్సులో ఆ భాష రాణించును. ఇది భాషాస్వత్వము. ఛందస్వత్వము. ఈ భాషా ఛందస్సుల యొక్క పరస్పర సంయోజనానుకూల సముచితత్వమును చూచిన పూర్వకవులు మహర్షులు. నన్నయ్య యట్టి ఋషి.

ఆధునికుల యొక్క ఛందస్సులు కూడ భాషాస్వబావము నాశ్రయించియే యున్నవన వచ్చును. భాష యెచ్చటనైనను రెండు విధములు. వాడుకభాష, రెండవది గ్రాంధికభాష. గ్రాంధిక భాషయనినంతనే కొందఱు మొగము మురకటించుకొందురు. గ్రంధిక భాషయనగా నియమితమైన భాష. నియమము నాగరకత. యధేచ్ఛావృత్తి గ్రామీణత. అసంయమిత. రాజ్యవ్యవహార పరిషత్తులలో కాని, భాషా పరిషత్తులలో కాని పదిమంది సముదాచారవంతుల సమావేశములో కాని, వీధిలో మాట్లాడు భాష మాట్లాడరు కదా? ఇతర సభలలో మాట్లాడినచో పరిహసింతురు. రాజ్యాంగ పరిషత్తులలో మాటాడినచో శిక్షాపాత్రు లగుదురు. అందుచేత భాషకీ విభాగము తప్పదు. కావ్యము నాగరకతావృత్తము కలది కనుక, అంతర్వ్యవహార సంబంధి కనుక ఉదాత్త విషయ పరిశీలనా భూమి కనుక జాతి యొక్క లక్ష్యములను నిరూపించు వ్యాపారము నాశ్రయించినది గనుక దానియందు నియమిత భాషయుండుట న్యాయముకదా!

భాషకలదు, భావము కలదు. కవి యొక్క యావేశము కలదు. కవి చెప్పునటువంటి విషయము యొక్క ప్రాధాన్యము కలదు. కవియొక్క నేర్పు కలదు. ఇన్నియున్నవి. ఇందులో కొన్ని తక్కువవి కొన్ని యెక్కువవి. ఎక్కువైనవాని సంయోగము చేత తక్కువైనవాని కొకొకప్పుడు యోగ్యతాస్థానము వచ్చినట్లు కన్పించును. ఆ సందర్భము, తక్కువైన ఈ విషయము ఎక్కువతనము కలది అన్న భ్రాంతిని కల్పించును. ఉదాహరణముగా అనాగరకమైన భాషలో ఒకానొక ప్రజోపకరమైన విషయము చెప్పబడినది. దానికాదరణము వచ్చినది. విషయ పురస్కృతమై వచ్చినదికాని అచటనున్న భాషనుబట్టి రాలేదు. ఆ సందర్భమునందా భాషకు ప్రాధాన్యము నిరాకరించబడలేదు. గనుక సర్వత్ర దానికి ప్రాధాన్య వివక్ష చేయుట అపరిశీలనా మతిజనితము.

వాడుకభాషలో నాలుగైదు మాటలతో – చాలాసార్లు కర్తకర్మాదులు లేకుండగనే – భావము చెప్పుట కలదు. ఈ మార్గమును కొందరు ప్రౌఢకవులు గూడ తమ కావ్యములం దచ్చటచ్చట నవలంబించిరి. వారవలంబించిన లక్షణము వేరు. వారు భావము యొక్క లోతులను తీసికొని అచ్చటి పాత్రయొక్క మనో లక్షణమును సందర్భోచిత్యమును పరిశీలించి దానినెన్నుకొనిరి. ఆధునిక కవులలో వక్త కవియే. అతని భాష అతనిదే యనుచున్నది. అతడు పాఠకునకు ముఖాముఖిగా నిలుచున్నాడు. కావ్యములలోని పాత్రలు పరోక్షముగా నున్నారు. ఆధునిక కవి ప్రత్యక్షముగా నున్నాడు. లోకములోనే చూడవచ్చును. ఎవరో యెక్కడో మనలను గురించి యనిన మాటకు మన యెదురుగనే మనలను గురించి యనిన మాటకు మనము స్వీకరించెడి లక్షణములో భేదము కలదు. పరోక్షమైన మాటకు అధిక కోపము వచ్చును. ప్రత్యక్షమయిన మాటకువచ్చిన కోపమును నియమములో పెట్టుకొని వానిని నిందింతురు. వానితో పోరాటమునకు దిగుదురు. పరోక్షమైన మాటకు వచ్చిన కోపము గాఢతరమైనది. ఈ సాదృశ్యముచేత రస విషయమును పర్యాలోచించవచ్చుచు, కథాగతములైన విషయముల వలన కలుగు మనోభావములు హృదయముల మీద గాఢతరమైన ముద్ర కలిగించును. ప్రత్యక్షముగా వినిన మాటలకు నెడద మీద నంత ముద్రలేదు. అది వెంటనే ప్రతిసమాధేయమగుచున్నది కనుక. ఈ భేదము కథామయ కావ్యగత కవితానుభవమునకు, కవియే వక్తయైన కావ్య కవితానుభవమునకు పట్టకతప్పదు. మఱియు ఈ క్రొత్త కవి వ్రాసెడు వాడుక భాష మన హృదయముమీద ముద్రితమగుటకు దానియందు నియమము లేదు. దానికి శక్తి లేదు. ఈ వాడుక భాషలోని వాక్యమసమగ్రము. దాని ముద్రయు అల్పము. ఆ ఛందస్సునందు పుష్టి లేదు. ఈ మార్గమునకొక సమాదరము కలిగినచో ఆ గుణము ఆ మార్గము నాశ్రయించినది కాదు. ప్రజాబాహుళ్యమునందు నెలకొనిన కొన్ని యాధునిక సమస్యలు దానియందు సరామర్శింప బడుటయే దానియందు చూపబడుచున్న తాత్కాలిక సమాదరము యొక్క హేతువు.

ఇంక పూర్వ కవిత్వము. ఈ పూర్వ కవిత్వము యొక్క సామాగ్రియు తొలుత చెప్పబడినది. ఈ వట్టి సామాగ్రి నాశ్రయించి వ్రాయబడెడు కవిత్వమున కెప్పుడును గౌరవము లేదు. కాని ఆ ఛందోమార్గమున కొక పుష్టి గలదు గదా! పుష్టి గల యీ మార్గమున యొక వైలక్షణ్యము కలిగిన శబ్దముల కూర్పుచేత తక్కువ భావనాశక్తి గల కవి యొక్క రచనకు గూడ ప్రసిద్ధి వచ్చుట కలదు. ఈ మార్గములో నొక దోషమున్నది. అతడేమి చెప్పెనని కాదు, ఎంత మధురముగా చెప్పెనని. మాధుర్యము, సౌకుమార్యము, సరిగా నర్థము చేసికోబడని ప్రసన్నతాగుణము, అపూర్వ ఛ్ఛందోమార్గమున నేడు తాండవము చేయుచున్నవి. భావనా పటిమకు గౌరవము తగ్గిన యేకాలమునందైనను వాని యుద్ధత నృత్యము తప్పనిసరియే.

భావము, సౌకుమార్యము – మొదటిది ప్రధానముగా నర్థమునకు సంబంధించినది. రెండవది ప్రధానముగా శబ్దమునకు సంబంధించినది. జనసామాన్యము రెండవదానికి వశులు. విశేషజ్ఞులు తొలుతటి దానియందు సమాదరము కలవారు. ఇది పరిహరించరాని మానవ లక్షణము. సర్వజనులు గాఢశీలురు కారు. మహా విజ్ఞానవంతులు కారు. అందుచేత గాఢ భావనా లక్షణము పరిమిత సంఖ్యాకులైన కొందఱకే పట్టును. కాని వారెక్కడనున్నారో ఎట్లు

తెలియును? అందుచేత తత్ప్రయత్నము మానకూడదు. నిత్యమైనదదియే. జాతియొక్క పరమ నాగరకతా లక్షణ మదియే. మానవ జీవితములోని లోతులను స్పృశించువారు వారే, వారే మానవ జీవిత పరమార్థ పతాకాభూతులు.

మన పూర్వాలంకార గ్రంథములు శబ్దము యొక్క నిర్దుష్టత వాక్యరచనలోని నిర్దుష్టత ప్రధానముగా స్వీకరించి చెప్పినవి. భావమును విడబఱచి చూపించినవి. రసాదులను సూచించినవి. పాశ్చాత్య విమర్శ గ్రంథములు వేరు త్రోవ త్రొక్కినవి. పాత్రపోషణము, కావ్యరచనాకాలము, కవి జీవితము, కావ్యమునందలి కవిజీవన ప్రతిబింబము, కవి సమకాలిక విషయ పరిశీలన, కవియొక్క స్వంతమైన సుఖదుఃఖములు కావ్యమునందు నిరూపించుట, చరిత్ర – ఇత్యాది విషయములకు వారి విమర్శ ప్రాధాన్యమిచ్చినది. చదివిన వారనగా ఇంగ్లీషు చదివినవారే అయిన ఈనాడు ఆ ఇంగ్లీషు భాషా కావ్యములలో నున్న ఈ సూత్రములు కావ్య ప్రధాన లక్షణముగా పరిగణించుట తప్పనిసరియై పోయినది. అందుకనియే పలుమంది యాధునిక కవుల కావ్యములందు అసంస్కృత శబ్దస్వరూపములు అనిర్దిష్టార్థక శబ్ద ప్రయోగము, ఆంగ్లేయ భాషా మర్యాదానుకూల వాక్య విన్యాసములు, పరదేశ సంస్కార బహుళ భావములు, తద్దేశగత మహాకవుల మార్గముల ననుసరించుటలు, వానియందు రమించుటలు మిక్కిలిగా కనిపించుచున్నవి. తాత్పర్యమేమనగా ఆధునిక బహుళాంధ్ర కావ్య ప్రపంచమున దేశీయత తక్కువ విదేశీయత యెక్కువయైనది. ఇది యింతటితో నాగలేదు. ఈ సూత్రములతో పూర్వ కావ్యములను విమర్శించుటయైనది. వట్టి పాత్రపోషణము అన్న విషయమును తీసికొని విచారించినచో పాశ్చాత్యుల యొక్క ఉత్తమ కావ్యములయందు పాత్రపోషణమన్న విషయము మిక్కిలి ముఖ్యమైనది. ఏలననగా ఆ కావ్యమునం దొక కథ కలదు. అది కల్పిత కథ. దానియందు కథా పర్యవసానము పరమ ముఖ్యమైనది. ఆ కథ కట్టి పర్యవసానము ఆ కథయందున్న భిన్న పాత్రముల యొక్క మనోవృత్తులచేత, స్వభావములచేత సంప్రాప్తమైనది. అందుచే వారి పాత్ర పరిశీలనము కథా పర్యవసానదృష్ట్యా చేసినచో నధిక విషయములు గోచరించును. ఆ పర్యవసానము యొక్క తథాభూతస్థితికి ఆ పాత్రల యొక్క స్వభావము హేతువగుచున్నది. తత్పరిశీలన ముచితమగుచున్నది. మన కావ్యములయందలి కథ లిట్టివి కావు. ఈ కథలలో విచారింపతగినది రసము, భావము, ఔచిత్యము, మన కావ్యములను విమర్శించునప్పుడు ఈ దృష్టితో విచారించవలును. ఆ దృష్టితో విచారించినచో ఇవి నీరస కావ్యములవలె కన్పించును. ఇదివరకే కనిపించినవి.

నేటి యాంధ్ర సారస్వతములో గద్యరచన నవలలుగా, చిన్నకథలుగా, వ్యాసములుగా, విమర్శనములుగా విజృంభించినది. ఇది పాశ్చాత్య సారస్వత సంయోగము చేత నొకటి, సాంఘిక రాజకీయాది పరిస్థితులు, పాశ్చాత్య దేశగత తత్పరిస్థుల ననుసరించి మారుటచేత నొకటి, తప్పనిసరి యైనది. ఒకానొక మార్పు సర్వదిశలనుండి వచ్చుచున్నది. ఒక చిన్న కావ్యము వ్రాయునపుడు పెట్టికొనిన నియమములు సువిస్పష్టముగా కనిపించును. కావ్యము చిన్నది గనుక వెంటనే గోచరించును. ఆ కావ్యము మిక్కిలి తళతళలాడుచున్నట్లు కనిపించును. ఒక మహాకావ్యములోని నియమములు పఱచబడి అంత తేలికగా కనిపించవు. మంది యైక్కువైనకొలది మజ్జిగ పలుచన. ఇది తప్పదు. కాని మంచి గృహస్థు ఆ మజ్జిగలో ఇంత

కరివేపాకు ఇంత ఉప్పు లేదా నిమ్మకాయరసము, ఉప్పు లేదా శొంఠిపొడి, ఉప్పు వేయును. జనులు ఆ చిక్కని మజ్జిగ కంటె ఈ మజ్జిగనే ఎక్కువగా ప్రియముగా నాస్వాదింతురు. పంక్తి మీద ఇట్టి మజ్జిగయే ఎక్కువ రుచి, మన యింటిలో మనము భోజనము చేయుచున్నప్పుడు కొలదిమంది మిత్రులతో కలిసి భోజనము చేయుచున్నప్పుడు ఆ మజ్జిగకు రుచిలేదు. పెరుగునకే రుచి, రుచిగాని ఆ వస్తువు యొక్క చిక్కన పలుచనలుగాని వేళనుబట్టి, పూర్వమున తెలుగు వచనములో రెండు మూడు కావ్యములు కలవు. అందులోని వచనము బిగింపు కలది. కూర్పు కలది. ఒకశైలిని సంతరించవలయునన్న ప్రయత్నము కలది. చిన్నయసూరి నీతిచంద్రిక అటువంటిది. ఆంధ్రములో ఒకటి రెండు కావ్యములు తప్ప తక్కినవన్ని చంపువులు. అనగా గద్యపద్య మిశ్రితములు. ఆ కావ్యములలోని గద్యములను విచారించినచో పద్యములవలె నవియును ప్రౌఢములు, రచనాశిల్పరమణీయములును. మధ్యకాలములో కొందరు సేనానాయకులు వ్రాసిన వచన గ్రంథములు కలవు. వాని శైలియే వేరు. ఈ కొద్దిలోననే వచన రచనయందు రెండు మూడు భేదములు కలవు. ఈ కాలమున నవల మొదలైన పలురూపములు తాల్చిన ఆంధ్ర గద్యరచన చిన్నయసూరి వచన రచనవలె, నన్నయ్య గారివచన రచనవలె నుండవలెననుకొనుట పరిస్థితులెరిగిన యాలోచనదిగాదు. 'గద్యం కవీనాం నకషం వదంతి' ఇది పూర్వకాలపు మాట. 'కవీనాం' అని ఉన్నదికాని వచన రచన చేయు అందరికి అది లేదు.

పద్యము వేఱు, గద్యము వేఱు, కావ్యములకు వ్రాసిన వ్యాఖ్యానముకూడ గద్యము. లోకోక్తులు, లోకమునందున్న పరిస్థితులు పద్యమునందు వ్రాసినచో దానిని స్వభావోక్తియను యలంకారమనిరి. ఈ స్వభావోక్తులు, లోకోక్తులు వచన రచనయం దనంతముగా నుండును. ఇంతకు ఈ వచనమునకు ప్రమాణముగా ఆంగ్లేయ దేశపు గద్యరచనా పరిణామమును తీసుకొనవచ్చును. మెకాలే, ఫ్రూడ్, కార్డినల్ న్యూమన్, కార్లైలు, మొదలైనవారి వచన రచన వేరు. డీన్, ఇంగ్ మొదలైనవారి వచన రచన వేరు. ఆధునికాంగ్లేయ రచయితల వచన రచన వేరు. సోమర్‌సెట్ మాఘమ్ యొక్క వచన రచన వేరు. స్కాట్ నవలలోని ఇంగ్లీషు గద్యమునకు, థామస్ హార్డీ గద్య రచనమునకు ఏమి సంబంధము?

అట్లే తెలుగు గద్య రచన కూడ కాలమును బట్టి, వ్యక్తులను బట్టి, వస్తువును బట్టి, సాహిత్యశాఖను బట్టి, పలు విధములుగా మారును. కాని ఒక్కటి మాత్రము ప్రధానము. తెలుగు నుడికారమును వదలరాదు. దుష్టశబ్దములను ప్రయోగించరాదు. ఈ ఉల్లంఘనము ఈనాడు పెద్ద కవులన్నవారి గ్రంథములయందే కనిపించుచుండగా వచన రచయితల సంగతి చెప్పుటెందులకు?

ఈ కాలమున విమర్శనలు రెండు విధములు. మొదటిది తమ కిష్టమైన కవిని తీసుకొని వాని కవితలో ఉన్నవి లేనివి తాననుకొన్నవి అతని రచనచేత నిరూపింపబడనివి బహు గుణము లున్నట్లు చెప్పుట. ఇవి భావుకులైన వారు తమలో తాము నవ్వుకొనునట్లుండును. ఈ వాక్యమున కింత యర్థము, ఈ శబ్దమున కిది యర్థము. ఈ యర్థము పుట్టుటకు వాక్య విన్యాసమిట్లుండవలయును. మొదలైన విచారణ తక్కువై ఇంగ్లీషు గ్రంథముల విమర్శనల ననుసరించి ఏదో యేదో ఊరకే పెంచి వ్రాయుచున్నారు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Na+Sampadakeeyalu**

* * *